# "ఏటికేతంబెట్టి ఎయిపుట్లు పండిత్తె"

"ఏటికేతంబెట్టి ఎయిపుట్లు పండిత్తె ఎన్నడో మెతుకెరగరన్నా.......నేను గంజిలో మెతుకెరుగరన్నా' ఈ పాట యాదికచ్చినా, చదివినా, ఎక్కడన్నా విన్నా నాకు మా ఊరు యాదికత్తది. రైతు బతుకు యాదికత్తది. పాటలు పాడుకుంట మోటుగొట్టేటి నారాయణ రెడ్డి యాదికత్తడు. నా మనసంతెక్కడెక్కన్నో తిరుగుతుంటది.

కీలకనామ సంవత్సరమచ్చింది. మా చెరువెండి ఎరగప్పయింది. పంటలు పండె బూములన్ని నెర్రెలు వాసినయి. ఎక్కడ జూసినా దుబ్బ గొట్లాడుతంది. బాయిల్ల నీల్లు పాతాలం లోతులున్నయి. రోహిణి కార్తి రాంగనే వాన సిసుక్కోసం ఎదురుసూత్తంద్రు జెనం. ఆయుటి పూనుతె మంచిగుండని అంగలార్సింద్రు. మొగులుమీన సిన్న మబ్బుతునుక కనవడితె సంబురపడింద్రు. గాలచ్చి ఆ మబ్బు తేలిపోంగనే కండ్లపొంటి నీల్లు దీసుకున్నరు. పెద్ద పూసాల, చిన్న పూసాల(పునర్వసు, పుష్యమి) కార్తులచ్చినా ఇగ వానసినుకు పడకపోతె ఏడ్సిమొత్తుకున్నరు. ఇయ్యేడు గూడ దేవుడు మామీన దయజూపెటట్టు లేడని ఏడ్సింద్రు. కప్ప తల్లాడింద్రు. వానదేవుని బతుకమ్మ పాట పాడింద్రు. పొరుగూల్లెనుంచి అయ్యగార్ని తీసుకచ్చి విరాటపర్వం కత సెప్పిచ్చింద్రు. అయినా గని ఒక్క సినుకు రాలలే. మగ, పుబ్బ కార్తులల్ల గూడ బజార్లపొంటి దుమ్మువేసింది.

ఇగ గా ఏడు మస్తు కరువచ్చింది. సాన మందిండ్లల్ల ఒక్క వడ్లిత్తన్న లేదు. కొద్దిగోతీరుగున్నోడు గూడ గడుకంబలి తాగవలసచ్చింది. అద్దొరికినా ఎక్కనే అనుకున్నరందరు. గప్పున్నేను ఎలిగేట్ల పదకొండో తరగతి సదువుతన్న. గా యేడే కొత్తగ బోర్డు పరీక్షకు పోవాలె. తిండిమందమన్న కొన్ని వడ్లిత్తులు పండిచ్చుకోవన్నని మా నాయిన్న వాగుల పొలంలున్ను, రాంమిట్టుకు యాతాలు వెట్టిండు. ఆగుల పొలం పారిచ్చే పని నాకప్పజెప్పిండు. రోజు పొలం బారియ్యాలె. ఆరేడు కిలోమీటర్లు నడిసి బడికి పోవాలె. పరీక్షకు సదువుకోవాలె. గా యేడు మస్తు కష్టపడ్డ.

రాత్తిరిదాక దీపం ముందట గూసుండి సదువుకునెటోన్ని. అటెనుక కొంతసేపు పండెటోన్ని. పంటె నిద్దుర పట్టకపోవు. పెద్దరాత్తిరి లేసి యాతం బొయ్య పొయ్యెటోన్ని. కొంచెంసేపు యాతం బోసి అక్కన్నే బాయిగడ్డమీన నిద్రవొయ్యెటోన్ని మల్ల తెలివైందంటె లేసి పొలం బారిచ్చెటోన్ని. కొంతసేపు యాతంబోసి ఎంత పారిందో సూద్దామని పోయిసూత్తె సాపెలుపన్న పారకపోవు.

ఎక్కడినీల్కక్కన్నే ఇనికిపొయ్యేటియి. పొలాన్ని సూత్తంటె కండ్లపొంటి నీల్లచ్చేటియి. తెల్లారెవరకు పొలం బారియ్యాలె. అటెనుక బడికి నడిసిపోవాలె. బడికాల్చెమైతె సారుగొడుతడు. గందుకోసురం దువ్వదవ్వ యాతం బోసెటోన్ని. రెక్కలు గుంజుకపొయేటియి. కాళ్ళీడ్సుకపొయ్యేటియి. కడుపుల బరబర అకలయ్యేటిది? వరుదలోలె సెముటలు గారేటియి. అయినా గని పట్టువట్టి యాతంబోసెటోన్ని. పొద్దెక్కెవారకు మా నాయిన్నచ్చెటోడు. పొలం దిరిగి సూసెటోడు.

"నీ రెక్కలు పొడైనయి కని సగమన్న పారలే. ఇగ నువ్వు తయారై బడీ పో. నేంబోత్త' అని సాతగాకున్నా యాతం బోసెటోడు. నేను దవ్వదవ్వ[34] ఇంటికిపొయ్యి మొకం గడుక్కోని, బొక్కెంతోని నీల్లు సేదుకోని నెత్తిమీదికెల్లి పోసుకొని తానమయిందనిపించుకునెటోన్ని. జెప్పజెప్ప బట్టలు తొడుక్కోని ఉడుకుడుకు గడుక బువ్వ ఊదుకుంట తినెటోన్ని. అండ్ల కలుపుకుంటానికేందన్న కూరుడుకుతె కూర, లేకుంటె తొక్కు కలుపుకునెటోన్ని. అటెనుక పెరుగేసుకొని ఆటుమాటు కలుపుకోని తిని బడికురికెటోన్ని. సాయంత్రం బడినుంచచ్చినంక మల్ల పొలం బారియ్యాలె. గిట్ల ఆ యేడు ఇర్గ కట్టవడ్డ. సేతులన్ని కాయలు గాసినయి. ఒక్కోసారి నేను లేకుంటె నాయిన్న లేపిటోడు.

"తెల్లారి సుక్క పొడ్సింది పొలంబారియ్యాలె. ఆల్చెమయితది లే" అని లేపిటోడు.

రాత్తిరి పోతె నాకు దూరం నుంచి మంటలతీరుగ కనవడేటియి. గవ్వి దయ్యాలనెటోల్లు. నాకు దయ్యాలమీన నమ్మకం లేదు. గొర్లమందలకాడ, పొలాలల్ల సలికి, సుట్టంటువెట్టుకోను పెట్టుకునే మంటలని నాకటెనుక తెల్సింది.

నేను యాతంబోసే పొలం దగ్గర్నే నారాయణరెడ్డి పొలముండేటిది. అయినె పొలానికి మోటవెట్టిండు. ఓ పారోపారయినె, ఇంకోసారి నేను మొదాలచ్చి పని మొదలువెట్టెటోల్లం. అయినె అచ్చిండంటె ఇగ పాటలు మొదలయ్యేటియి. రాగాల్దీసుకుంట, పాటలు పాడుకుంట మోట గొట్టెటోడు. గా పాటింటె నాకు కుషనిపిచ్చేది. అయినె కంటం[35] మైలుకంటెక్కో దూరమే ఇనచ్చేది.

**"రారేముల్లో కల్లుదాగ పోదాము**
**తాటికల్లు తాగుదాము తమ్మని పెండ్లాన్నమ్మదాము**
**ఈతకల్లు తాగుదాము ఇద్దరి పెళ్ళాలమ్మదాము**
**రారేముల్లో కల్లుదాగ వోదాము"**

అనే పాట రాగం దీసుకుంట ఉషారుగ పాడెటోడు.

ఇంక ఏరువాక పాటను సంబరంగ పాడెటోడు. ఎడ్లను ఔఔ అని అదిలిచ్చుకుంట రాగాల్దీసెటోడు. "నడువుర రాజన్న, నువ్ నడువుర మల్లన్న. దవ్వదవ్వ నడిసి నువ్ పొలంబారియ్యాల

ఎంకన్న" అని ఎడ్లతోని మాట్లాడుకుంట మోట గొట్టెటోడు. గా పాటలినుకుంట నేసుత్సాహంగ యాతం బోసెటోన్ని. గవ్వి నా సెవ్వుల పడితె తియ్యటి పాయిసం తిన్నట్టనిపిచ్చేటి.

గా నారాయణ రెడ్డే సంతోషంగ లేనప్పుడేమో గీ పాట పాడెటోడు.

ఏటికేతంబెట్టి ఎయిపుట్లు పండిత్తె
ఎన్నడో మెతుకెరుగరన్నా
నేను గంజిలకు మెతుకెరగరన్నా
నా దేటి బతుకాయెరన్నా
నారాయణ రెడ్డి గొంతు జీర
వోంగ గీ పాట పాడెటోడు.

గీ పాట వింటుంటె రైతుల కష్టాలన్ని కండ్లముందుట్టనిపించేటియి. ఆ యేడు దేశానికన్నంబెట్టే రైతుకే అన్నం కరువయింది. ఎన్నిక మోటలు గొట్టినా యాతం బోసినా తిండి మందమన్న పంటపండలే. దుకాండ్లల్ల మక్కలు, దొడ్డు బియ్యం కొనుక్కచ్చు కునుడయింది. గది యాదికచ్చినప్పుడల్ల నా కడుపుల సెయ్యివెట్టి దేవినట్టయితది. గా సంవత్సరం నేను కండ్లనిండార సూసి అనుబగించిన.

దగ్గెర దగ్గెర ఇరవై ఏండ్లు గడిపినంక గిప్పుడు గూడ ఎవుసం సేసెటోల్ల బతుకులు గట్లనే ఉన్నయి. సాలీసాలని కడుపుకు తినుడు కండ్ల వడుతనే ఉంది. ముసలోడయినా నారాయణ్రెడ్డి కొడుకుల్తోని కల్సి ఇంకా ఎవుసం సేత్తనే ఉన్నడు. గవ్వే దొడ్డ బట్ట లేసుకుంటండు. సగం కడుపుకే తింటండు.

పాటల సెప్పినట్లు యాతం, మోట పెట్టి రైతులు ఎయిపుట్లు పండిచ్చినా పండియ్యకున్నా గంజిలకు మెతుకైతె కరువే ఐతంది. మట్టె మన్నె బొర్లే రైతు కష్టానికి తగిన ఫలం దొరుకక ఇబ్బందులు పడుడు సూత్తుంటె గా రైతన్న పరిస్థితి మంచిగైతె బాగుండునని నా అండ్ల నేనే మదనపడుత.......

☆☆☆